# INBOX

THE ROOF TOP RESTAURANT

WE INVITE YOU TO

# GRAND OPENING

OF OUR NEW

## INBOX - THE ROOF TOP RESTAURANT

**15-MAR-2026**
**SUNDAY**

## OPENING OFFER

# 10% DISCOUNT

**15-MAR-2026 - 31-MAR-2026**

**T&C APPLY**

**INBOX RESTAURANT,**
Opp Brundavanam Function Hall
Srikakulam - 532001

నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 125 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
15-03-2026 ఆదివారం వెల : 1/- పేజీలు : 4

# కొనుగోలు కేంద్రాలను తెరవండి..
# మొక్కజొన్న రైతును ఆదుకోండి

- కనీస మద్దతు ధర చెల్లింపునకు వెంటనే చర్యలు చేపట్టండి
- కష్టకాలంలో ఆపన్నహస్తం అందించి మానవతను చాటుకోండి
- మాజీ రెవెన్యూ మంత్రి వర్యులు ధర్మాన ప్రసాదరావు
- పంటకు అవసరం అయిన యూరియా అందించడంలోనూ.. విఫలం అయిన తెలుగుదేశం ప్రభుత్వం
- గిట్టుబాటు ధర దక్కక కన్నీరెడుతున్న రైతు.. ఎకరాకు 28 వేల రూపాయల మేరకు నష్టం..
- సాధ్యమయ్యే మాటలే చెప్పండి..అర్థం కాని మాటలు చెప్పవద్దు..రైతును నిలువునా..ముంచవద్దు



**నవతరం -శ్రీకాకుళం**

మొక్కజొన్న రైతుల కష్టాలపై మాజీ మంత్రివర్యులు ధర్మాన ప్రసాదరావు స్పందించారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. కనీస మద్దతు ధర దక్కక రైతులకు దారుణమయిన రీతిలో రోడ్డున పడిపోతున్నారని ఆవేదన చెందారు. వెంటనే సంబంధిత వర్గాలు రంగంలోకి దిగి ఎక్కడికక్కడ నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించాలని, ప్రభుత్వం తరపున రైతుకు అండగా నిలవాలని కోరారు.
కొందరు వ్యాపారుల తీరు కారణంగా, దళారీల కారణంగా ఎకరాకు ఇరవై ఎనిమిది వేల రూపాయల చొప్పున రైతు నష్టపోతున్నాడని, కనీస మద్దతు దొరక్క పంట ఏం చేయాలో తెలియక కన్నీరుమున్నీరవుతున్నాడని, ప్రభుత్వం వారి కన్నీళ్లను అర్థం చేసుకుని మానవతా దృక్పథంతో స్పందించాలని డిమాండ్ చేస్తూ..ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., శ్రీకాకుళం జిల్లాలో ఖరీఫ్ వరి వ్యవసాయం తరువాత పెద్ద ఎత్తున్న మొక్కజొన్న సాగుచేశారు. గడిచిన కొంత కాలంగా కొన్ని సంవత్సరాలుగా మొక్కజొన్న సాగుతో కొంత ఉపశమనం రైతుకు కలుగుతోంది. ఈ సంవత్సరం కూడా భారీ ఎత్తున వేసిన మొక్కజొన్న ఇప్పుడిప్పుడే చేతికందుతోంది. ప్రభుత్వాలు మొక్కజొన్న క్వింటా ఖరీదును రెండు వేల నాలుగు వందల రూపాయలుగా నిర్ణయించి మినిమం సపోర్ట్ ప్రైస్ (కనీస మద్దతు ధర)ను ప్రకటించడం జరిగింది.
ఈ రోజు మార్కెట్లో పదహారు వందల రూపాయలకు పదిహేడు వందల రూపాయలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రైతులు అమ్ముకోవాల్సి వస్తుంది. నేటి వరకూ ఎక్కడ కూడా మీరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం ఎప్పుడైనా సపోర్ట్ ప్రైస్ ను ఎనౌన్స్ చేస్తే సపోర్ట్ ప్రైస్ రానప్పుడు సపోర్ట్ ప్రైస్ కు ప్రభుత్వం తరపున కొనుగోలు చేసే ఏర్పాటు చేయవలసి ఉంటుంది. అప్పుడే సపోర్ట్ ప్రైస్ అన్న మాటకు అర్థం ఉంటుంది.
మొక్కజొన్న పంట వేసినప్పుడు మీరు ఎరువు ఇవ్వండి అని అడిగితే మీరు నేరుగా యూరియా వారికి సరఫరా చేయలేకపోయారు. చివరకు బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సిన దుఃస్థితి ఏర్పడింది. కొంతమంది బలహీనులయినటువంటి రైతులకు యూరియా అందలేదు కూడా !
యూరియా ఎంత మొత్తం పంటకు వేస్తున్నారన్నది కొంత భిన్నమయిన వాదన ఉన్నప్పటికీ తాను వేయాలనుకున్నటువంటి యూరియాను ప్రభుత్వం అందించలేకపోయిందన్నది రైతులు ఆనాడు చాలా నిరుత్సాహంగా చెప్పారు. ఇంటిల్లపాదీ రక్తాన్ని చిందించి, చెమటగా చిందించి పండించబోతున్న పంటకు ఎరువు ఇవ్వండి అంటే ఇవ్వలేని దిక్కులేని పరిస్థితులు ఉన్నాయని బాధపడ్డారు. మీరెవ్వరూ దాని గురించి పట్టించుకోలేదు.
నేడు మళ్లీ కష్టపడి పండించుకున్నపంట కల్లానికి వస్తే అమ్ముదామంటే సపోర్ట్ ప్రైస్ ఇచ్చే పరిస్థితి లేదు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఇలాంటి పరిస్థితే ప్రీవియస్ గవర్నమెంట్ లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు మొక్కజొన్నకు ఓపెన్ మార్కెట్లో సపోర్ట్ ప్రైస్ రావడం లేదంటే అన్ని మార్కెట్ యార్డులలో సపోర్ట్ ప్రైస్ ఇచ్చి, మార్కెట్ ఇంట్రవెన్షన్ను -మిగతా 2లో

# పదవ తరగతి పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవి బాబు



**నవతరం -శ్రీకాకుళం**

మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వరకు జరగబోవు 10వ తరగతి పరీక్షలు నిర్వహణకు తగు ఏర్పాట్లపై స్థానిక విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా డి.ఇ.ఓ. ఎ. రవి బాబు మాట్లాడుతూ 2026 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి పరీక్షలను 145 పరీక్ష కేంద్రాలను ఐడెంటిఫై చేసి నిర్వహించడం జరుగుతుందనీ, ఇందుకు సంబంధించి 28 598 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.
ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 గంటల 30 నిమిషముల నుండి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషములు వరకు జరుగుతాయని తెలిపారు.
ఇందుకు సంబంధించి -మిగతా 2లో

# పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు



**నవతరం -శ్రీకాకుళం**

ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ప్రశాంత చిత్తంతో పరీక్షలు రాయాలని ఆయన ఆకాంక్షించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. పదేళ్ల విద్యా ప్రస్థానంలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమైనవని, ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై, క్రమశిక్షణతో చదివి, మంచి మార్కులు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలవాలని అని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, కేంద్రాల వద్ద మంచినీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. విద్యార్థులు గడువు సమయాని కంటే ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

# జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా

4లో

- పవన్ కళ్యాణ్ ప్రేరణతో ఉద్దానం కిడ్నీ సమస్యలకు పరిష్కార మార్గం
- 200 మంది కార్మికుల సభ్యత్వ నమోదు - పలువురు జనసేన పార్టీలో చేరిక



# పలాస జిల్లా సాధనతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం



- ఉద్దానంలో పారిశ్రామిక-వ్యవసాయ అభివృద్ధి ఎక్కడ?
- రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గంగా ఇచ్ఛాపురం ముద్ర..
- సాగునీరు, త్రాగునీరు లభ్యత తక్కువే
- విద్య, వైద్యం, రవాణా సదుపాయాలు స్వల్పం
- ఉద్దానంలోనే మత్స్యకారుల వలసలు ఎక్కువ
- ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు జాడేది?
- పలాస జీడి కార్మికులకు ఈఎస్ఐ హాస్పిటల్ ఒక స్వప్నమేనా?
- సామాజిక రంగ అభివృద్ధిలో వ్యత్యాసాలు
- అధికార వికేంద్రీకరణతోనే పలాస జిల్లా ఏర్పాటుకు సుగమం
- ఉద్దానం ప్రజల చిరకాల ఆకాంక్ష పలాస జిల్లా ఏర్పాటు
- జిల్లా సాధనకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా)

2లో

# బాలిగాంలో రూ.17 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభం



## మరో రోడ్డుపనులకు శంకుస్థాపన

**నవతరం-మందస**

మందస మండలం బాలిగాం గ్రామంలో రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు, అనంతరం బాలిగం పాత రోడ్డులో 11 లక్షలు వ్యయంతో జరగనున్న రోడ్డుపనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ అభివృద్ధి దిశగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం వల్ల ప్రజలకు రాకపోకలు సులభమవుతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మండల కార్యదర్శి సాలీనా మాధవరావు, దాసరి తాతారావు, తమిరియా భాస్కర్, లబ్బ రుద్రయ్య, చంద్రశేఖర్ ముంజేటి, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, డుంకూర తిరుపతి, కొనారి తులసీరావు, అడ్డీ ఈశ్వర్‌రావు, ఔగాన ఈశ్వర్, చంద్రశేఖర్ సవర తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎడిటోరియల్

# ఇరాన్ పట్ల భద్రతా మండలి పక్షపాతం!

గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలు మరియు జోర్డాన్‌పై ఇరాన్ దాడులను ఖండిస్తూ భారత్‌తో సహా 135దేశాలు ప్రతిపాదించిన తీర్మానాన్ని బుధవారం నాడు 15 దేశాలతో కూడిన భద్రతామండలి 13-0 ఓటుతో ఆమోదించింది. రష్యా, చైనా ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఇరాన్ శృతిమించిన దాడులకు పాల్పడినట్లు తీర్మానంలో వర్ణించారు. వెంటనే అన్ని దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అయితే ఈ తీర్మానాన్ని ఇరాన్ పూచికపుల్ల మాదిరిగా తీసి వేస్తుందని వేరే చెప్పనవసరం లేదు. ఈ రోజు మమ్మల్ని ఖండించారు. నేడు మేము, రేపు మరొక సర్వసత్తాక దేశం అవుతుంది గనుక తీర్మానం వంటి పొరపాట్లు చేయవద్దని ఇరాన్ ప్రపంచ దేశాలను కోరింది. గల్ఫ్‌లోని తమ దీవులపై దాడులు చేస్తే పర్షియా జలసంధిలో రక్తపుటేరులు పారిస్తామని భద్రతా మండలి తీర్మానం తరువాత ఇరాన్ స్పీకర్ ప్రకటించాడు. అమెరికా దాడులు పదమూడవ రోజులో ప్రవేశించాయి. ఆ దాడులను ఖండిస్తూ ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ వెంటనే ఒక ప్రకటన చేయటం తప్ప భద్రతామండలి చేసిందేమీ లేదు. ఖండన తీర్మానం కూడా ఎవరూ పెట్టలేదంటే అమెరికా వీటోతో మురిగిపోతుందని తెలిసిందే. దాడులను బహిరంగంగా ఖండించిన చైనా, రష్యాలు ఎందుకు ప్రవేశపెట్టలేదు అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఆ దేశాల ప్రతినిధులు ఆ పని చేసినా దాన్ని వీటో చేసేందుకు అమెరికా, ఇతర దాని మిత్రదేశాలు సిద్ధం సుమతీ అన్నట్లుగా ఉంటాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు సమర్ధనీయం కాదని చైనా స్పష్టంగా చెప్పింది. మిలిటరీయేతర పౌర ప్రాంతాలపై దాడులు తగవని, ఉద్రిక్తతల నివారణకు పూనుకోవాలని కోరింది. రష్యా ఎలాంటి ప్రకటన చేయలేదు. చైనాకు ఇరాన్ ఎంత ముఖ్యమో గల్ఫ్ దేశాలూ అంతే. మన విషయానికి వస్తే ఇరాన్‌పై దాడిని ఖండించలేదు, తీర్మానం ద్వారా గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులను మాత్రం ఖండించింది. భద్రతా మండలిలో తీర్మానం ప్రవేశపెట్టబోయే ముందు మిత్రదేశమైన ఇరాన్‌తో తప్ప ఇతర మిత్రదేశాలన్నింటితో మన దేశం మాట్లాడింది. ఈ సందర్భంగా కొందరు పశ్చిమదేశాల వ్యాఖ్యాతలు అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్ అమెరికా దాడులను ఖండించారు, అదే ప్రకటనలో ఇరాన్ ప్రతిదాడులు చేస్తున్నదని చెప్పటం వాటిని సమర్ధించటమే అని భాష్యం చెబుతున్నారు.

తమపై శత్రువులు దాడులకు దిగితే హోర్ముజ్ జలసంధిని దిగ్బంధనం చేస్తామని, ఆ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలు ఎక్కడున్నా వాటిని వదలబోమని ఇరాన్ ఎప్పటి నుంచో చెబుతున్నది. తమ దేశాల్లో అమెరికా స్థావరాల ఏర్పాటుకు అంగీకరించిన గల్ఫ్ దేశాలు తమ గడ్డ మీద నుంచి ఇరాన్ మీద దాడులకు అనుమతించబోమని ప్రకటించి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదేమో. అలాందిదేమీ లేదు, యుద్ధం ప్రారంభమైన తరువాత అమెరికా తన యుద్ధ విమానాలను సైప్రస్‌కు తరలించినట్లు వార్తలొచ్చాయి.అదే పని ముందే చేసి ఉన్నా గల్ఫ్ దేశాల మీద కచ్చితంగా ఇరాన్ దాడులు చేసి ఉండేది కాదు. ఆ దేశాల దోబూచులాటలు కూడా తాజా పరిణామాలకు కారణమన్నది స్పష్టం. తన పౌరనివాసాలపై, స్కూళ్లపై మాత్రమే గాక చమురు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన తరువాతే గల్ఫ్ దేశాల చమురు కేంద్రాల మీద ఇరాన్ దాడులకు దిగింది.యుద్ధంలో ఒకసారి ఒకరు నీతినియమాల గాడి తప్పిన తర్వాత మరొకరిని నిందించే నైతికహక్కు ఎవరికీ ఉండదు.

ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేస్తామంటూ దాడులకు దిగిన అమెరికా- ఇజ్రాయిల్ చేసిందేమిటి? 19,734 పౌరనివాసాల మీద దాడులు , ఇప్పటి వరకు 1,348 మందిని చంపి, పదిహేడు వేల మందిని గాయపరిచారు. అరవై అయిదు స్కూళ్లు,77 వైద్య కేంద్రాలు దాడులకు గురయ్యాయి. ఇరాన్ ప్రతిదాడుల్లో కూడా అలాంటివేమైనా ఉన్నదీ లేనిదీ ఇంతవరకు ఏ దేశమూ ప్రకటించలేదు. ఇరాన్‌పై దాడులను స్వయంగా అమెరికా సాధారణ పౌరులే సమర్ధించటం లేదని తాజా సర్వేలన్నీ వెల్లడించాయి. మరోవైపు యుద్ధంలో గెలిచామని, అయినా దాడులను కొనసాగిస్తామని ట్రంప్ చెబుతున్నాడు. మరోవైపు అమెరికా గెలిచేదారిలో లేదని తనను తానే అపహాస్యం చేసుకుంటున్నదని అంతర్జాతీయ మీడియాలో కథనాలు ప్రారంభమయ్యాయి. యుద్ధ లక్ష్యాల గురించి ట్రంప్ చెప్పినట్లుగా తాను చెప్పినవారిని గాక కొత్త సుప్రీమ్ నేతను ఇరాన్ ఎన్నుకుంది, ఇంతవరకు అణుకేంద్రాలు చెక్కుచెదరలేదు, ఇతర మిలి టెంట్ గ్రూపులకు ఇరాన్ మద్దతు నిలిపివేయలేదు, అలాంటి వాటిలో ఒకటి హిజబుల్లా కూడా రంగంలోకి దిగింది. ఇజ్రాయిల్‌కు ముప్పు తప్పించారా అంటే లేదు. ఇలాంటి వాటిని చూపి అమెరికా గెలిచే దారిలో లేదని చెబుతున్నారు.

హమాస్‌ను అణచేపేరుతో గాజాలో ఇజ్రాయిల్ జరిపిన మారణహోమం, విధ్వంస కాండను చూసిన తర్వాత ప్రపంచ మిలిటరీ శక్తిగా ఉన్న అమెరికా తన ఆయుధాలతో ఇరాన్‌లో కూడా అదేపని చేయనుందన్నది స్పష్టం. ఎంత చేసినా పాలస్తీనియన్లకు ఇజ్రాయిల్ ఎలా లొంగదీసుకోలేదో ఇరానియన్లు కూడా అమెరికాకు తలవంచే అవకాశం లేదని చెప్పవచ్చు!

# కొనుగోలు కేంద్రాలను తెరవండి.. మొక్కజొన్న రైతును ఆదుకోండి

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం చేసి, ధరలు నిలబెట్టి రైతులను ఆదుకున్నాం. ఆనాడు రైతులే ప్రభుత్వానికి జొన్న గింజలను ఇచ్చి ఆ రోజు పంటను అమ్ముకునే పరిస్థితి వచ్చింది. నేడు మార్కెట్లో ఉన్న పరిస్థితులు చూస్తే..రెండు వేల నాలుగు వందల రూపాయలు రావాల్సినటువంటి క్వింటా మొక్కజొన్న ధర కేవలం పదిహేడువందలే పలుకుతుంటే , సుమారుగా ఏడు వందల రూపాయలు తేడా వస్తుంది. ఒక ఎకరానికి నలభై బస్తాలు మొక్క జొన్న పండితే..ఒక్క బస్తాకు ఏడు వందల రూపాయలు చొప్పున మొత్తంగా 28 వేల రూపాయలు నష్టం రైతుకు ఇవాళ వస్తోంది. పరిస్థితులు కింది స్థాయిలో ఇలా ఉంటే మీరేం చెబుతున్నారు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించి రైతుకు గొప్ప మేలు చేస్తారట ! ఇవన్నీ తప్పించుకునేటటువంటి మాటలు కదా ! కళ్లెదురుగా పండించినటువంటి పంట తనకు ఏదయితే లాభంగా మిగులుతుందో ఆ..డబ్బు అందించలేనటువంటి స్థితిలో ప్రభుత్వాలు ఈ పరిపాలనలో తగలడుతుంటే, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అని, ఎక్కడో ఇజ్రాయిల్ టెక్నాలజీ అని రైతులకు అర్థం కాని మాటలు మాట్లాడి మోసం చేయడం తగదని ఈ సందర్భంగా విన్నవిస్తున్నాను.

ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు తెరవండి. మార్కెట్ ఇంట్రవెన్షన్ ద్వారా కొంత డబ్బును విడుదల చేయండి. క్వింటా జొన్న గింజలకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం ఆ..రెండు వేల నాలుగు వందల రూపాయలు ప్రతి రైతుకూ వచ్చిన విధంగా చెప్పండి. ఎక్కడయినా క్వింటా జొన్న గింజలను పదిహేడు వందల రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని తెలిస్తే వెంటనే నిలుపుదల చేయండి. చేయించండి. వారిపై చర్యలు తీసుకోండి. మేం కొంటున్నాం ఆగండి అనే మాట చెప్పండి. పెద్ద డిపార్ట్మెంట్ అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఉంది. మార్కెంటింగ్ డిపార్ట్మెంట్ ఉంది. ఎన్ని అనుబంధ విభాగాలు ఉన్నాయి. అందరినీ కలిపి రంగంలోకి దించండి.

పంట పండితే కనీసం ధర ఇప్పించలేని దిక్కుమాలిన స్థితి. పంటకు పండించేందుకు కావాల్సిన ఎరువు ఇప్పించలేని దయనీయ స్థితి ఇవాళ మన రాష్ట్రంలో నెలకొని ఉంది. ఏంటీ పరిస్థితి అని ప్రశ్నిస్తున్నాను.? సంబంధిత వర్గాలను నిలదీస్తున్నాను. వెంటనే ప్రభుత్వం దిగి రావాలని, కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని, వెంటనే బాధిత రైతాంగానికి అండగా నిలవాలని, అలానే సపోర్ట్ ప్రైస్ వచ్చేందుకు వెంటనే మార్కెట్ ఇంట్రవెన్షన్..ను.. చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాను.. అని పేర్కొన్నారు.

# పదవ తరగతి పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

మొదటిపేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ వారు పదవ తరగతి పరీక్షలకు సంబంధించి వివిధ శాఖలకు పరీక్షలు సజావుగా నిర్వహించడానికి గాను తగు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ వెసులబాటు టైము 30 నిమిషములు ఇచ్చినప్పటికీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పరీక్షలను దృష్టిలో పెట్టుకొని సకాలంలో పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా హాజరయ్యే విధంగా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ వారు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారని, పరీక్షా కేంద్రాల్లో వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని అటువంటివి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబడువని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి బుక్స్ మరియు స్లిప్పులు వంటివి తీసుకురాకూడదని తెలియజేశారు. ఇందుకు సంబంధించి 145 పరీక్ష కేంద్రాల్లో 145 మంది చీఫ్ సూపరింటెండెంట్ లను, 145 మంది డిపార్టుమెంటు అధికారులను నియమించినట్లు తెలిపారు మరియు ఏడు సిటింగ్ స్వేడులను ఏర్పాటు చేసినట్లు చేసినట్లు ఓపెన్ విద్యార్థులకు రెండు సిట్టింగ్ స్వేడ్లను నియమించినట్లు తెలిపారు. 145 పరీక్ష కేంద్రాల్లో 8 కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు అందువలన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడవని అన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతాయని తెలియజేశారు. ఈ సమావేశంలో జి. చంద్రభూషణ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుత్వ పరీక్షలు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు అందిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఆడబిడ్డలు అందరూ వేయించుకోవాలి

**నవతరం -రణస్థలం**

గర్భాశయ క్యాన్సర్ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న HPV వ్యాక్సిన్ను ఆడబిడ్డలు అందరూ వేయించుకోవాలని శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు గారు పిలుపు నిచ్చారు.

ఈ రోజు రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ జనార్దన్ నాయుడు, డాక్టర్ యమున ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఈఆర్మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఆడబిడ్డలందరికీ ఉచితంగా అందిస్తున్న హెచ్ పీ వీ వ్యాక్సిన్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళ ఆరోగ్యం గా ఉంటే ఇల్లు బాగుంటుంది.. అనే ఉద్దేశ్యం తో కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింది.



# పలాస జిల్లా సాధనతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం

**నవతరం -పలాస**

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ, అందులో శ్రీకాకుళం జిల్లాలో ఒక ప్రాంతమైన పలాస జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ఒక ప్రతిపాదన చేసి, చివరి నిమిషంలో మొండి చెయ్యి చూపిన తీరుతో, పలాస ప్రాంత ప్రజల చిరకాల వాంఛ పై నీళ్లు జల్లి, అన్యాయం చేసినట్లు అయిందని ప్రముఖ సామాజిక వేత్త, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన పలాసలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ, ఒకప్పుడు ఒడిస్సా పాలకులు, తరువాత మదరాసు రాష్ట్ర పాలకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తోపాటు నేటి విభజన ఆంధ్ర ప్రదేశ్ వరకు కూడ ఎన్నో ప్రభుత్వాలు వచ్చినప్పటికీ, రాజ్యాంగం ప్రసాదించిన అభివృద్ధి ఫలాలు అందకుండా, కొన్ని దశాబ్దాలు పాటు ప్రాంతీయ అసమానతలకు, వెనుకబాటు తనానికి గురైన ప్రాంతాలలో శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం ప్రాంతం ఒకటని దువ్వాడ శ్రీధర్ (బాబా) స్పష్టం చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం సరియైన సాగునీటి వనరులు తీవ్రమైన కరువు రావడంతో, ఇక్కడ ప్రజానీకం నాడు మయన్మార్ (బర్మా) దేశంలో గల రంగూన్ కు లక్షలాదిమంది వలసలు పోయారని, దేశానికి స్వాతంత్రం వచ్చాక కూడా నాటి పాలకుల నిర్లక్ష్యం వల్ల, స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక అండమాన్, భిలాయ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, అస్సాం వంటి ప్రాంతాలకు కూడా ఉద్దానం ప్రజలు వలసలు పోయారని ఆయన గుర్తు చేశారు. ఉద్దానంలో ఏ పల్లెలో చూసిన పురుషుల కంటే మహిళలు, యువకుల కంటే వృద్ధులు ఎక్కువగా ఉంటారన్నారు. ఉమ్మడి రాష్ట్రం తో పాటు విభజన ఆంధ్ర ప్రదేశ్ లో కూడా అత్యంత వెనుకబడిన ప్రాంతం శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం నియోజకవర్గం తోపాటు పలాసలో కొంత భాగం, పాస్పటల్ నియోజకవర్గంలో కొంత భాగం వెనుకబడి ఉన్నాయి. శ్రీకృష్ణ కమిషన్ రిపోర్ట్ లో ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం గురించి గణాంకాలతో సహా అధికారులు నిరూపించారని, అయితే వెనుకబడిన ప్రాంతానికి అభివృద్ధి ప్యాకేజీ తోపాటు మరికొన్ని మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అంశాలు సక్రమంగా అమలు కాలేదన్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో స్వాతంత్ర్యం సిద్ధించినప్పటికీ, అప్పటినుంచి ఇప్పటివరకు వెనుకబాటుతనశీ, ప్రాంతీయ అసమానతలు, వలసలు, పేదరికం మరింత పెరుగుతున్నాయే తప్ప తగ్గలేదన్నారు. ఒక ప్రాంత అభివృద్ధి స్థాయిని తెలియజేసే ప్రామాణికం కొలమానమే మానవ అభివృద్ధి సూచిక మరియు విద్య, పారిశ్రామిక ప్రగతి, వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు తదితర మానవ వనరుల గణాంకాల మిశ్రమ సూచిక తోపాటు తలసరి ఆదాయం కూడా పరిగణలోకి తీసుకోవలసి ఉంటుందని ఆయన వివరించారు.

ఉత్తరాంధ్రలో గల గ్రేటర్ విశాఖ ప్రజల తలసరి ఆదాయానికి ఉద్దానం ప్రాంత ప్రజల తలసరి ఆదాయానికి చాలా తేడా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పలాస - కాశిబుగ్గ మున్సిపాలిటీ మినహా ఉద్దానంతో పాటు పాతపట్నం, టెక్కలి నియోజక వర్గాలలో అనేక మండలా లలో వ్యవసాయ, పారిశ్రామిక రంగా అభివృద్ధిలో చాలా వ్యత్యాసాలు ఉన్నాయని, పేదరిక రేఖ దిగువున నివసించే జనాభా ఇక్కడ ఎక్కువ అన్నారు. పట్టణీకరణలో వ్యత్యాసాలు, సామాజిక రంగ అభివృద్ధిలో వ్యత్యాసాలు, చివరకు విద్యుత్ తలసరి వినియోగంలో కూడా చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇంకా ఇప్పటికీ రూ. 100 నుండి రూ.150 దినసరి ఆదాయంతో బతుకుతున్న ప్రజలు ఇక్కడ ఉన్నారని,పాతపట్నం నియోజకవర్గంలో పాటు పలాస నియోజకవర్గం లో కూడా నివాస యోగ్యమైన గృహ సదుపాయము లేక అనేకమంది గిరిజనులు, ఇతర పేదలు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన ఉద్దానంలో ప్రాంతీయ అసమానతలు, తక్కువ తలసరి ఆదాయం, పారిశ్రామికీకరణ లోపం,పేదరిక, నిరక్షరాస్యత మరియు మౌలిక సదుపాయాల కొరత, ఆర్థిక వెనుకబాటుతనం లేకపోలేదు అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం గత ఏడున్నర దశాబ్దాలుగా పాలకులు పట్టించు కోకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి విడిపోయి మద్రాస్ రాష్ట్రం,ఆంధ్ర రాష్ట్ర,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజన ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన గాని పాలకవర్గాలు భారీ ప్రాజెక్టుల వైపు మొగ్గు చూపాయి తప్ప ఈ ప్రాంత ప్రత్యేకతలకు తగ్గట్టుగా నీటి ప్రాజెక్టులకు అభివృద్ధి చేయడంలో గాని, పారిశ్రామికీకరణ చేయడంలో గాని శ్రద్ధ పెట్టలేదని ఆయన విమర్శించారు. స్థూలంగా చెప్పాలంటే శ్రీకాకుళం జిల్లాలో చివరగా ఉన్న ఉద్దానం వెనుకబాటుకు ప్రధాన కారణం పాలకుల నిర్లక్ష్యంతో పాటు అధికారంలో ఉన్న తమ ప్రాంత అభివృద్ధికి కృషి చేయని స్థానిక ప్రజా ప్రతినిధుల స్వార్థ రాజకీయాలే కారణమన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో చిన్న, సన్న కారు రైతులు ఎక్కువగా ఉన్నారని , మూడో వంతు మంది రైతులు రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమి కలిగినవారే ఉండడంవల్ల, ఈ భూమి కమతాల సైజు కూడా క్రమంగా తగ్గుతుందని, అందుకు సన్న, చిన్న కారు రైతాంగం వ్యవసాయం చేసుకునేందుకు సాగునీటి లభ్యత కూడా చాలా తక్కువ అన్నారు. వంశధార, మహేంద్ర తనయ,బహుద వంటి నదుల నుంచి వర్షపు నీరు వృధాగా బంగాళాఖాతంలోకి పోతుందని, అందుకు ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మాణం లేకపోవడం వల్ల సాగునీటితోపాటు, త్రాగునీరు లేక అటు రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోవాల్సి రావడంతో, వ్యవసాయంపై ఆధారపడ్డ అనుబంధ రంగాలకు చెందిన అనేక వర్గాల ప్రజలు ఉపాధి లేక వలసలు పోవడం పరిపాటిగా మారిందన్నారు.

మరోపక్క జిల్లాలో సుదూర సాగర తీర ప్రాంతం ఉన్నప్పటికీ, మత్స్యకారులు చేపల వేటకు అనువైన ఫిషింగ్ హార్బర్లు లేకపోవడం వల్ల ఈ వృత్తిపై ఆధార పడ్డ వృత్తిదారులు ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకొని ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. ఇంకోపక్క అభివృద్ధి పేరుతో ఈ ప్రాంత సహజ వనరులు కొల్లగొట్టుకుపోతుంటే, మరో పక్క ప్రజలు తీవ్ర పేదరికంలోనికి నెట్టి వేయబడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రకృతి వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ, పర్యావరణాన్ని కాపాడుతూ, మత్స్యకారులకు ఉపాధి రక్షణ, ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు, కోల్డ్ స్టోరేజ్ లు వంటి మౌలిక వసతులు కల్పించాలని,అలాగే జీడి రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తిని పెంపుదల,పంటకు గిట్టుబాటు ధర, జీడి కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి పలాసలో ఏర్పాటు, రైతాంగ ప్రయోజనాల కోసం వంశధార జలాలను ఇచ్చాపురం వరకు కొనసాగింపు, ఆఫ్షోర్ నిర్మాణం వంటి అంశాలపై పాలకులు దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రాంతీయ అసమానతలు తొలగి సామాజిక అభివృద్ధి చెందాలంటే ఏకైక మార్గం పలాస జిల్లా కేంద్రం గా ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని దువ్వాడ శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకపోతే వీరనారి గున్నమ్మ వారసత్వం, గరిమెళ్ళ,గిడుగు, శ్రీ శ్రీ, గురజాడ వంటి ఉత్తరాంధ్ర సాంస్కృతిక వీరుల దార్శనికత యువత పుణికి పుచ్చుకొని , శ్రీకాకుళం గిరిజన ఉద్యమం, సోంపేట పర్యావరణ పరిరక్షణ ఉద్యమాల స్ఫూర్తితో బలమైన ప్రజా ఉద్యమాలు రూపు దిద్దక మునిపే , కూటమి ప్రభుత్వం తక్షణం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలమేర పలాస జిల్లా ను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# భారతీయ పురుషుడి జీవితం బాధ్యతలతో నిండిన గీత రా



పుట్టిన నాటి నుంచే పోరాటం రా
బాధ్యతలతోనే జీవిత మారా
నవ్వు వెనక దాచిన బాధల రా
భారతీయ పురుషుడి నిజమైన కథ రా

ఆడుకోవాల్సిన చిన్న వయసులో
పుస్తకాల సంచి భుజాన వేసారు
ర్యాంకులు మార్కులు అని చెప్పి
బాల్యాన్ని కూడా పరుగులో పెట్టారు

కలలు ఉన్నా మనసులో లోపల
కెరీర్ కోసం వాటిని మర్చారు
లక్షల మందితో పోటీ పడుతూ
జీవితం ముందుకు నడిపారు

పుట్టిన నాటి నుంచే పోరాటం రా
బాధ్యతలతోనే జీవిత మారా
నవ్వు వెనక దాచిన బాధల రా
భారతీయ పురుషుడి నిజమైన కథ రా

ఉద్యోగం వచ్చిందంటే వెంటనే
పెళ్లి బాధ్యత ముందుకు వస్తుంది
భార్య పిల్లల నవ్వు కోసం
తన ఆనందం వెనుకే మిగులుతుంది

తనకు చొక్కా కొనాలన్నా ఆలోచిస్తాడు
పిల్లల ఫీజులకైతే అప్పు చేస్తాడు
కుటుంబం సంతోషమే తన సంతోషం
అని నిశ్శబ్దంగా జీవితం సాగిస్తాడు

అరవై వయసు దగ్గరైనా కూడా
విశ్రాంతి మాట వినిపించదు
పిల్లల భవిష్యత్తు మనవళ్ల కోసం
మళ్లీ కష్టపడటమే ఆగదు

అనారోగ్యం వచ్చినా దాచుకుంటాడు
"నాకేం కాలేదు" అని నవ్వుతాడు
త్యాగాల కథ ఎవరికి చెప్పకుండా
నిశ్శబ్దంగా ఈ లోకం విడిచిపోతాడు

అది ఒక నిజం... మన కళ్ల ముందే
నడిచే ఓ నిశ్శబ్ద గాథ రా
భారతీయ పురుషుడి జీవితం
బాధ్యతలతో నిండిన గీత రా

రచన:తేరాల రాజేందర్ ప్రసాద్
9297109223

# "ప్రపంచ శాంతికి" చిహ్నం... "శ్రీ పరాభవ"నామ ఉగాది ఉత్సవం

రణభేరి మ్రోగుతున్న వేళ...
రక్తం ఏరులై పారుతున్న వేళ
ధరణి గుండెలు దద్దరిల్లుతున్న వేళ...
రానే వచ్చింది "శ్రీ పరాభవ" నామ...
తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవం
పొంగే ఆశల పొదరిల్లులా..!

డ్రోన్ మిస్సైల్ల అగ్నిజ్వాలల్లో
మాడిపోతున్న మానవత్వానికి
"శాంతి కంచుకోట"ను స్థాపించగా
రానే వచ్చింది "శ్రీ పరాభవ" నామ..
తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవం
అలరించే అందాల హరివిల్లులా..!

విద్వేషపు విషవాయువుల మధ్య
ఊపిరాడక తపిస్తున్న లోకానికి
"ప్రేమను ప్రాణవాయువు"ను పంచగా
రానే వచ్చింది "శ్రీ పరాభవ"నామ...
తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవం
విందు వినోదాల విరిజల్లులా...!

పరాభవమంటే పరాజయం కాదు...
అది అశాంతికి పరాభవం...
అసూయా ద్వేషాలకు పరాభవం...
అగ్రరాజ్య యుద్ధకాంక్షకు పరాభవం..!

షడ్రుచుల పచ్చడిలో
వేపపువ్వంటి
యుద్ధపు చేదును మింగి
బెల్లం తీపంటి...
రేపటి శాంతి
సౌఖ్యాలను పంచగా
కొండంత ఆశతో
గుండెనిండా ధైర్యంతో...!

యుద్ధ మేఘాలను...
చీల్చుకుంటూ సూర్యకిరణంలా...
రానే వచ్చింది "శ్రీ పరాభవ నామ"
తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవం
యుద్ధగాయాల్ని మాన్పే వైద్యునిగా...
శాంతిని అందించే శాంతికపోతంలా..!

కష్టాలను కన్నీళ్ళని తొలిగించి...
చీకటి కమ్మిన జీవితాల్లో వెన్నెల
వెలుగుల్ని నింపి...ప్రశాంతతను
చిరునవ్వుల సిరిసంపదలను...
భోగభాగ్యాలను శాంతిసౌభాగ్యాలను..!

ఆయురారోగ్య అష్టైశ్వర్యాలను...
ప్రసాదించే శ్రీ "పరాభవ"నామ...
తెలుగు సంవత్సర ఉగాది ఉత్సవానికి..!
పలుకుదాం...పలుకుదాం...
స్వాగతం...సుస్వాగతం...ఘనస్వాగతం.



కవి రత్న, సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ట్రిపుల్ ఐటీ డీన్‌గా సింహాచలం



**నవతరం- ఎచ్చెర్ల**

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఎచ్చెర్ల క్యాంపస్ విద్యార్థుల బాలుర సంక్షేమ విభాగం డీన్‌గా డాక్టర్ సింహాచలం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సంద్ర అమరేంద్ర కుమార్, పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల సంక్షేమానికి, విద్యా సంస్థ అభివృద్ధికి డాక్టర్ సింహాచలం అనుభవం ఎంతో దోహదపడుతుందని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, క్యాంపస్-2 ఇన్‌ఛార్జ్ సాగర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



# ఎట్టకేలకు టాలీవుడ్‌లో మరో అవకాశం

20 ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో ఉంటోంది. ఇప్పటికీ అడపాదడపా అవకాశాలు అందిపుచ్చుకుంటూనే ఉంటోంది. అది ఐటెంసాంగ్ అయినా, గెస్ట్ రోల్ అయినా, ఓటీటీ ఛాన్స్ అయినా విడిచిపెట్టడం లేదు. మరోవైపు ఫొటోషూట్ల సంగతి సరేసరి. ఇలా లైమ్ లైట్లో ఉండేలా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడుతూ వస్తోంది తమన్నా.
ఎక్కువగా బాలీవుడ్ పై ఫోకస్ చేస్తున్న మిల్కీబ్యూటీ, మరోసారి తెలుగులో మెరిసే అవకాశం దక్కించుకుంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే ఇరుముడి సినిమాలో ఆమె ఓ కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉంది. రవితేజ హీరోగా శివ నిర్వాణ ఇరుముడి సినిమాను తెరకెక్కిస్తున్నాడు. తండ్రీకూతురు అనుబంధంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రవితేజ అయ్యప్ప భక్తుడిగా కనిపించబోతున్నాడు. ప్రియాభవానీ శంకర్ ను హీరోయిన్ గా తీసుకున్నారు. ఇందులో ఓ కీలక పాత్ర కోసం తమన్నాను అనుకుంటున్నారు. ప్రస్తుతం గ్లామర్ డోస్ పెంచి రెచ్చిపోతోంది తమన్నా. ఇలాంటి హాట్ బ్యూటీని ఇరుముడి అనే టైటిల్ పెట్టి తీస్తున్న సినిమాలో కీలక పాత్ర కోసం తీసుకోవడం కాస్త ఆసక్తికరంగానే ఉంది. చివరిసారి ఆమె ఓదెల-2 సినిమాలో నటించింది. అంతకంటే ముందు భోళాశంకర్ లో కనిపించింది. లాంగ్ గ్యాప్ తర్వాత రవితేజతో కలిసి నటించబోతోంది. ఇరుముడి సినిమాకు జీవీ ప్రకాశ్ సంగీత దర్శకుడు.

# అప్పుడు నాటునాటు.. ఇప్పుడు లాటిన్ స్టయిల్

ఆర్ఆర్ఆర్ సినిమాలో నాటు-నాటు పాట ఎంత పెద్ద హిట్టయిందో అందరికీ తెలిసిందే. ఏకంగా ఆస్కార్ వేదికపై మెరిసింది ఈ సాంగ్. మళ్లీ అలాంటిది రీ-క్రియేట్ చేసే పనిలో పడ్డాడట రాజమౌళి. దీనికి సంబంధించి సీనియర్ కొరియోగ్రాఫర్ శంకర్ చెప్పిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.
మహేష్ బాబుతో చేస్తున్న సినిమా కథను శంకర్‌కు వివరించాడట రాజమౌళి. అందులో ఓ మంచి డాన్స్ నంబర్ కూడా ఉందంట. ఆ పాటను లాటిన్ శైలిలో తెరకెక్కించాలని రాజమౌళి భావిస్తున్నాడట. ప్రియాంక-మహేష్ మధ్య వచ్చే ఆ సాంగ్ కోసం వందల మంది లాటిన్ డాన్సర్లను తీసుకోవాలనుకుంటున్నాడట రాజమౌళి.
నాటు-నాటు పాట తరహాలోనే, వారణాసిలో లాటిన్ స్టయిల్‌లో సాగే ఆ పాట కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుందంట. ఇప్పటికే వారణాసిపై సోషల్ మీడియాలో తెగ చర్చ నడుస్తోంది. తాజాగా కొరియోగ్రాఫర్ స్టేట్‌మెంట్‌తో అంచనాలు మరింత పెరిగాయి. వారణాసి సినిమాకు సంబంధించి తాజాగా జార్జియా షెడ్యూల్ పూర్తయింది. ఆ షెడ్యూల్ పూర్తిచేసుకొని హైదరాబాద్ తిరిగొచ్చాడు మహేష్. మహేష్ నయా లుక్‌కు సంబంధించి



ఎయిర్‌పోర్టులో తీసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించి కొత్త షెడ్యూల్‌ను అంటార్కిటికాలో ప్రారంభించబోతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా హీరోయిన్ ప్రియాంక చోప్రా వెల్లడించింది. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకోనున్న తొలి తెలుగు చిత్రంగా వారణాసి గుర్తింపు పొందనుంది. సినిమాకు అంటార్కిటికా సన్నివేశాలు ఎంత కీలకమే, వారణాసి టైటిల్ గ్లింప్స్ చూస్తే అర్థమౌతుంది.

# హెచ్.జె.దొర గారి మృతి రాష్ట్రానికి తీరని లోటు: తిలక్





**నవతరం-శ్రీకాకుళం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపి గాను, కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ఉన్నతమైన పదవులు అలంకరించి రాష్ట్ర అభివృద్ధికి చేపట్టిన ఎన్నో కీలక సంస్కరణలలో భాగస్వామ్యం అయిన హెచ్. జె .దొర గారు మృతి రాష్ట్రానికి, శ్రీకాకుళం జిల్లా కి తీరని లోటని వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ అన్నారు. టెక్కలి పార్టీ కార్యాలయంలో దొర గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి దొర గారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చల్ల రవికుమార్ తో పాటు ఎంపీపీలు జడ్పిటిసి సభ్యులు, రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏ. పి. ఎం తీరుపై కన్నీళ్లు కార్చిన మహిళా అధ్యక్షురాలు....!

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు....





**నవతరం-మందస**

ఆమె ఒక గిరిజన మహిళ.. మండల మహిళా సమైక్యకు అధ్యక్షురాలు... సుదీర్ఘ కాలం మహిళా సమైక్యలో పనిచేసిన అనుభవం.. అధికార పార్టీకి విధేయరాలు.. అయినా ఆమె కంట కన్నీళ్లు పెట్టించారు ఆ వెలుగు ఏ పి ఎం.కూర్మారావు. ఇప్పుడు ఈ విషయం మందస మండలం లో చర్చనీయాంసం గా మారింది. మందస మండల మహిళా సమైక్యలో చోటు చేసుకున్న ఆ సంఘటన ఆలస్యం గా వెలుగు చూసింది... గత కొద్ది రోజులు గా అనేక పత్రికలలో మందస మండల మహిళా సమైక్య లో అవినీతి జరిగిందని, శిక్షణ పేరిట నిధులు స్వాహా చేశారని, చివరకి విలేకరుల పేరుతో కూడా నిధులు కైశీకర్యం చేశారన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల వెలుగు కార్యాలయం లో మహిళా ఎంటర్ప్రైనర్లకు సన్మానం పేరిట ఏ. పి. ఎం హడావుడి చేసారంట. ఈ కార్యక్రమం లో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు, గిరిజన నాయకురాలైన యాజక రవణమ్మ ను అవమాన పరిచేటట్లుగా ఏ.పి.ఎం..పైడి కూర్మా రావు వ్యవహరించినట్లు ప్రచారం.. గిరిజన మహిళ, మండల మహిళా సమైక్యకు ఆమె అధ్యక్షురాలని కూడా చూడకుండా పత్రికలలో వస్తున్న వార్తలకు విచక్షణ కోల్పోయి అసహనం తో "పత్రికలకు సమాచారం లీకు చేయడం ఏమిటి.? " అంటూ తీవ్ర పదజాలం తో ఏ. పి. ఎం పైడి కూర్మారావు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆ శాఖ ఉద్యోగులు గుసగుసలు. దింతో ఆమె అశ్చర్యం నకు గుర్రై కలత చెంది కంట కన్నీళ్లు పెట్టుకున్నట్లు సమాచారం. పదే పదే పత్రికలలో వస్తున్న వార్త లకు ఆమెను బాధ్యలను చేస్తూ నిందించడం తో ఆమె మానసిక వేదనకు గురైనట్లు తెలుస్తుంది. ఏ విలేకరులకు ఎటువంటి సమాచారం ఇవ్వని తనపై ఏ.పి.ఎం నిందలు వేచి తన పట్ల వ్యవహరించిన తీరు పై ఆమె తోటి మహిళా సభ్యులు వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం. ఇంతకు ముందు కూడా ఈ ఏ.పి.ఎం గిరిజనులు గొర్రెలు లాంటి వాళ్ళని అవమానకర మాటలు మాట్లాడి వివాదాస్పద మైయ్యారు. ఆ వివాదం నుంచి బయట పడిన కొద్ది రోజులకే మళ్ళీ గిరిజన మహిళ ను అవమానించారు. ఈయన కు గిరిజనులు పట్ల చిన్నచూపు ఉందన్న ఆగ్రహం ఆ సామాజిక వర్గ పెద్దల్లో చర్చ సాగుతోంది..అంతే కాకుండా ఈ ఏ. పి. ఎం.మందస మండలం లో ఎన్నడూ లేని విదంగా వెలుగు మహిళా సంఘాల లోకి సామాజిక ప్రస్తావన లు తెచ్చి సామాజిక విభజన చేశారన్న చర్చ ఆ ఉద్యోగులలో వినిపిస్తుంది. నా రక్తం లో వైసీపీ రక్తం ఉందంటూ వివాదస్పద వ్యాఖ్యలు చేసి వివాదస్పదం అయ్యారు . ఈయన వ్యవహార శైలితో ఆ శాఖ ఉద్యోగులే అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ఆశ్రా అగ్రస్థానం..

**నవతరం-శ్రీకాకుళం**

వినియోగదారుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై పోలినాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆసరా సంస్థ ఏర్పాటు చేసిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ పోస్టర్స్ ను ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అగ్ర తాంబూలం ఇస్తున్నారని అన్నారు. 2019 లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వినియోగదారుల రక్షణ చట్టం ప్రజలకు ఎంతో మేలుచేస్తుంది అన్నారు.. ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో సంస్థలు పనిచేస్తున్నా అందులో ఆసరా సంస్థ గణనీయమైన సేవ చేస్తుందని చెప్పారు.. పాటశాల స్థాయి నుండి విద్యార్థులకు వినియోగదారుల హక్కుల విషయమై పరిజ్ఞానం కల్పించాలని పోలినాయుడు సూచించారు.. ఆశ్రా సంస్థ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఎజ్రా.. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్.. శాసపు జోగినాయుడు.. గుడ్ల జగ్గారావు, కట్టా సారధి.. పాండ్రాంక్ తారక్ .కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# వడ్డితాండ్రలో గ్లోకోమాపై అవగాహన కార్యక్రమం...



**నవతరం-సంతబొమ్మాళి**

సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వడ్డితాండ్ర గ్రామంలో ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు సందర్భంగా వృద్ధులకు కంటి పరీక్షలు మరియు గ్లోకోమా కంటి వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్తాల్మిక్ అధికారి ఎమ్ ఆర్ కె దాస్ ప్రజలకు గ్లోకోమా కంటి వ్యాధిపై అవగాహన కల్పించారు. 40 సంవత్సరాలు పైబడిన వారందరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని, బీపీ షుగర్ వ్యాధిగ్రస్తులు, స్టిరాయిడ్ మందులు ఎక్కువగా వాడిన వారు, గ్లోకోమా కుటుంబ చరిత్ర గలవారు ప్రతి ఏడాది తప్పనిసరిగా నేత్ర వైద్య నిపుణులతో సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. తదనంతరం 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 8 మందికి కాట్రాక్ట్ ఆపరేషన్ కొరకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎల్ హెచ్ పి ఏ లక్ష్మి, ఆరోగ్య కార్యకర్త ఆర్ శ్రీనివాసరావు, 104 సిబ్బంది ఆర్ పూర్ణచంద్రరావు ,పి ఉమాశంకర్, ఆశా కార్యకర్తలు కే రాంబాయి, జి జ్యోతి, ఎస్ రూపవతి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నార్కోటిక్స్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

**నవతరం-శ్రీకాకుళం**

నార్కోటిక్స్ మాదక ద్రవ్యాలు మత్తుమందులు నిర్మూలన లక్ష్యంగా జిల్లాలో వివిధ దాడులలో దొరికిన మాదక ద్రవ్యాలను నిల్వ చేయుటకు నూతన భవన నిర్మాణం కొరకు జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ మరియు ఫస్ట్ ఎ .డి. జె. కోర్టు న్యాయమూర్తి, స్థల పరిశీలన చేసారు. దీనికోసం స్థానిక సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం ప్రక్కన ఉన్న



ఖాళీ స్థలంలో నాలుగు సెంట్లు విస్తీర్ణంలో భవన నిర్మాణం కొరకు కొలతలు వేయించి భవన నిర్మాణం నకు తగు ఆదేశాలు సూచనలను సంబంధిత అధికారులకు ఇచ్చారు.

ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, ఫస్ట్ ఎ.డి .జె. కోర్టు న్యాయమూర్తి పి. భాస్కరరావు, కోర్టు సూపరిండెంట్లు చంద్రశేఖరరావు, శ్రీనివాసరావు, ఆర్ . అండ్.బి., డి.ఇ.ఇ. ధనుంజయ, తహసిల్దార్ గణపతిరావు, రెవెన్యూ మరియు పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా

**నవతరం -శ్రీకాకుళం**

జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని ఏడురోడ్ల కూడలిలో శనివారం ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్, ఫారెస్ట్ డెవలప్మెంట్ రాష్ట్ర డైరెక్టర్ గేదెల చైతన్య ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ 2014 మార్చి 14న పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారని అన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యను దేశ దృష్టికి తీసుకువచ్చిన ఘనత పవన్ కళ్యాణ్‌కే దక్కుతుందని తెలిపారు. పలాసలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉద్యమంలా సాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆటో, రిక్షా కార్మికులు సహా 200 మంది సభ్యత్వం పొందారు. అనంతరం పెద్దపాడు ప్రాంతానికి చెందిన కొన్ని కుటుంబాలు, యువకులు జనసేన పార్టీలో చేరగా నాయకులు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.



కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**